ప్రతిఫలం

'గిరి'

౧

మొాజం ఆధిపత్యంకింద మొగల్ సైన్యాలు మరీదగ్గిరి కొచ్చాయి. అల్లరి మరీ హెచ్చింది గోలకొండలో. తానేషాఅంటే గిట్టని వాళ్లకి మొగల్ సైన్యం దండెత్తిరావటంచేత హృదయంలో సంతోషం కలిగినా మరణభీతి వాళ్లనికూడా వొదలింది కాదు. కాటికి కాళ్లుజాచుకో కూచున్న ముసలివాళ్లు తాము చస్తామనేభయంచేతనూ, తమ సంతానం మడిసిపోతోందనేచింతచేతనూ నిద్రానీళ్లని వొదులుకున్నారు. ఇంకా నాలుగుకాలాలు బతికే వయసువాళ్లస్థితి చెప్పనక్కరలేదు. స్త్రీలోకమంతా కోరికలన్నిటిలోకీ మిన్నగా వుంచుకునేవి సౌందర్యం, యవ్వనం. ఆసౌందర్యయవ్వనాలే యిప్పుడు వాళ్లకి పరమశత్రురూపం దాల్చాయి. అవి వుండి మురిసిన వాళ్లే యెక్కువభయపడుతోన్నారు. శత్రుసైన్యం రాకముందే యేదోశక్తితమని కురూపిణులుగా వృద్ధులుగా మార్చేస్తే ధన్యుల మనుకుంటోన్నారు. ఏమీ తెలీని పసిపిల్లలు యీ అల్లరికంతటికీ కారణమేమిటో బోధపడకపోవడంచేత పెద్దలతోబాటు తామకూడా యేడుస్తోన్నారు. మళ్లీ సాయంత్రం యింటిముఖం చూస్తామో లేదో అనేనమ్మకం లేనిసైనికులు వొదల్లేకవొదల్లేక యిళ్లని వొదిలిపోతోన్నారు: పరదాలుదాటి బైటికి రాని సుందరాంగులు మెరుపులా సౌందర్యం మెరిసిపోగా వొంటిగుడ్డల్నిసైతం లెక్కపెట్టకుండా వొళ్లంతా కంటినీళ్లచేతా, చెమటచేతా. స్నానంచేసినట్టయి, పట్టుగుడ్డలు దేహానికి అశుకోక్కుపోగా భర్తల మెడలకి వేళ్లాడబడి వీథుల్లో పడుతోన్నారు. అంట్లాంటి తమపెళ్లాల్ని వీథిమూలిలో తోసేసి వణుకుతోన్నకాళ్లతో జారిపోతోన్న తుపాకిని సవరించుకుంటో వెనక్కితిరిగి చూడకుండా కచేరీవేపునడిచిపోతోన్నారు. మరీ అంతధైర్యంలేనివాళ్లు తమస్త్రీలతో బాటు వీథుల్లోపడి యేడుస్తోంటే మరొాహాసైనికుడు వెనకాల్నుంచి వొచ్చి అతనితండ్రితాతల వీరత్వాన్ని జ్ఞప్తికితెచ్చి పౌరుషపుమాటలు పలికి తుపాకిని చేతికందిచ్చి నడిపించుకోపోతోన్నాడు. పాదుషా పతాకాన్ని యెత్తుగా పట్టుకొని గుఱ్ఱపురౌతుదళం వీథులవెంబడి తిరుగుతో భయపడాల్సిన అవసరంలేదనీ, తమక్షేమమే తనక్షేమంగా భావించే తానేషాబలం సామాన్యమైంది కాదనీ, గొంతెత్తి అరుస్తో ప్రజలకి ధైర్యం చెబ్తోన్నారు. ఐనా యేడ్పులు తగ్గటం లేదు. మొగడిమరణశయ్యపక్కనకూచొని యేక్షణాన వైధవ్యపిశాచం మీద దుముకుతుందో అని భయపడి యేడ్చే స్త్రీమల్లే యేడుస్తోంది కిల్లా సాంతం. ఉత్తరపువీథిలో మసీదుపక్కనుంచి రౌతుదళం పోతోంటే ఆమసీదు మొల్లా ముందుకొచ్చి చేతులు పైకెత్తి "కాఫరులకి రాజ్యం వొప్పచెప్పి విషయలోలుడైనవాడి రాజ్యం అంతమైంది. అదిగో అలాయెగుర్తోన్నపతాకానికి యిదే ఆఖరిరోజు." అని అరిచాడు. రౌతు తనగుఱ్ఱాన్ని ఆతనిమీద దుమికించి తనచేతిబర్చీతో వొక్కపోటుపొడిచాడు. ఆమొల్లా వొహచేత్తో నెత్తురుదుమికే ప్రదేశాన్ని అణిచిపట్టుకొని, "ఇస్లాంరక్షకుడైన ఔరంగజేబుకి జయమగుగాక" అని గొంతెత్తి పెద్దగా అరిచిపడిపోయాడు. రౌతు యింకొాహపోడుపుకి 'అల్లా' అని చతికిలపడిపోయాడు. వెంటనే మసీదులోంచి నలుగురు తురకలు బైటికి పరుగెత్తుతోవొచ్చారు. రౌతులు గుఱ్ఱాలదిగి వాళ్లరెట్టల్ని వెనక్కివిరిచికట్టి పాదుషా పతాకం ముందు నడిపిస్తో కాజీకఛేరివేపు తీసికెళ్లారు.

తానేషా పాదుషా, మాదన్న, ఆయన ఆంతరంగికుడు, అంగరక్షకుడు, మంత్రి, సర్వంఐన విశ్వ

నాథపండితుడు ముగ్గురూ బాలాహిసారు† పైకెక్కి చూస్తోన్నారు. కిల్లాచుట్టూ ఆమడదూరంవరకు అవుపడ్డది. మూసీనదివొడ్డున చాలాదూరంలో విడిసిన మొగల్ సైన్యంగుడారాలు అవుపడ్డాయి. మాదన్న ముందుగా తనుచూసి పాదుషాకి తనచెయిజాచి చూపించాడు. తరువాత విశ్వనాథపండితుడికిగూడా చూపించాడు.

"మనం అనుకున్నదానికన్న చాలాపెద్దదిగా వున్నట్టు అవుపడ్తోంది సైన్యం" పాదుషా అన్నాడు.

"కాదు. అంతపెద్దదేంకాదు." వొక్కనిమిషం ఆగి అన్నాడు మాదన్న, "మొన్ననే మనసైన్యాన్ని యెదురుపంపి వొచ్చినసైన్యాన్ని వొచ్చినట్టు యెదిరించేట్టు చేస్తే యీ అవస్థంతా తప్పేది. రాజ్యానికి ఇంతముప్పు రాకపోయేది. గోరుతో పోవాల్సింది గొడ్డండ్లతో పోవాల్సివొచ్చింది."

"ఆయుద్ధంపేరిట అంతజనం చస్తోంటే, యీ రాజ్యం, ప్రజాప్రాణాలపూచిని నెత్తిమీద పెట్టుకున్న నేను వుండి యేంచేయను?"

మాదన్న ఆమాటల్ని విననట్టు ఆవేపు చూస్తో, "దూరదూరం విడిసారుకాబట్టి అంతపెద్దగా అవుపడ్తోంది. అదీపోగా ఆతెల్లగా అవుపడేవన్నీ గుడారాలు కావు. గుండ్లూ గుట్టలూకూడా చాలావున్నాయి." అని నిజమేనా అన్నట్టు విశ్వనాథపండితుడివేపు చూసాడు. ఏదో గొప్పఆలోచనలో వున్నపండితుడు చప్పున కనుక్కొని, "అవును; ఆయేనుగలూ, గుఱ్ఱాలు మల్లే అవుపడేవి చాలాపోదలు. చీకటిమబ్బులో అవుపట్టం లేదు." అన్నాడు.

అట్లాగే యెడమవేపుకి తిరిగారు. మాదన్న భుజంమీద తనయెడమచెయి వేసి ఆనుకొని నుంచున్నాడు పాదుషా. ఇంకా వొస్తోన్నారు జనం పట్టణంనుంచి కిల్లాలోకి ప్రాణాలుకాపాడుకోడానికి. వొకచేత్తో పెళ్లాన్ని వుంకొకచేత్తో పిల్లల్ని పట్టుకొని నోట్లో శ్వాసలేకుండా పరుగెత్తుతో వొస్తోన్నారు పులినోటినుంచి తప్పించుకోవొస్తోన్నట్టు. పాదుషావేపు తిరిగి అన్నాడు మాదన్న, "ఇహ కిల్లాగవునులు మూయించాలి. ఏమాత్రం ఆలస్యమైనా కోటలో నిండేదంతా శత్రుసైన్యమే."

"ఆవొచ్చేవాళ్లకి దిక్కెవరు?"

"వాళ్లకోసంచూస్తే మనప్రాణాలకేవొస్తుంది."

అప్పుడే, భుజంమీద రెండేళ్లకొడుకునెత్తుకొని నిలవటానికిసైతం శక్తిలేని అతిసౌందర్యవతియైన యిరవైయేళ్ల యువతిని యీడుస్తో కిల్లావేపు వొస్తోన్న పారసీ ఉద్యోగస్థుడు వాళ్లందరికీ అవుపడ్డాడు. ఆయువతి స్థితినిచూసి పాదుషాకళ్లకి నీళ్లుకమ్మాయి. ఆవేపే చూస్తో, "అట్లాంటిస్త్రీలూ పిల్లలూ లెక్కలేకుండా చస్తోంటే వొక్కమనప్రాణాలకే వొచ్చిన భయమేమిటి?"

"లేకపోతే ప్రాణాలు దక్కాయని తమ అండజేరగలిగినవాళ్లు, వేలకువేలు వీళ్లతోబాటు మనతోబాటు హతమౌతారు."

మాదన్న ముఖంవేపు చూసాడు పాదుషా.

"ఇట్లాంటిస్త్రీలూ, పిల్లలూ యెందరోవున్నారీకిల్లాలో. వాళ్లప్రాణాలు కాపాడాలి" అన్నాడు మాదన్న.

పాదుషా మాట్లాడక కోటలోని వీధులవేపు చూసాడు.

౨

గవునులు మూసారు. అరబ్బుసైన్యమంతా సమభాగాలుచేసి గవునులదగ్గిర వుంచారు. వొంతుల చొప్పున రాత్రింబవళ్లు కన్నుమూయక కాచుకోకూచోటాని కేర్పాటైంది. బురుజులమీద నమ్మకమైన మన్నెదొరలు నియమింపబడ్డారు. ఆయాదొరలసిబ్బంది అంతా ఆయుధాలతోగూడా బురుజులమీద కోట

† కిల్లాలో రాజసౌధంమీద యెత్తుగా సింహాసనంమల్లేవున్న ప్రదేశం. ఇప్పటికీ వుంది.

గోడలపొడుగూత నింపారు ప్రతిబురుజుమీద గవిని మీద ఫిరంగు లెక్కించి అవసరమైనగుండు, మందును పంచుల్లోనింపి సిద్ధంచేసివుంచారు. రాజసౌధంచుట్టూ, రాణివాసంచుట్టూ అక్కన్నమాదన్నలకు మిక్కిలి నమ్మకమైన స్నేహితుల్ని బంధువుల్ని కాపలా వుంచారు. రాజసౌధంపైకి వెళ్లేతోవలోవున్న మసీదు పక్కనే పాదుషాకు మిక్కిలినమ్మకస్తుడైన అబ్దుర్రజాక్ అక్కన్న, పెద్దసైన్యంతో వున్నారు. తక్కిన తురక సేనానాయకులు తమతమ సైన్యాలతో ఠాణాలమీద యేర్పాటైనారు. పడమరమూలకి యుద్ధమాసన్నమైన ప్పుడు పనికొచ్చేందుకు ఏనుగుల్ని, గుఱ్ఱాల్ని, వొంటెల్ని, సిపాయిల్ని, వొక్కనిమిషంలో సిద్ధమయ్యేట్టు యేర్పాటుచేసారు.

రాత్రంతా నిద్దర్రాలేదు విశ్వనాథపండితుడికి. తెల్లవారక ఆరాత్రి అట్లాగేవుండిపోవాలని కోరు కున్నాడు. మళ్లీ ఆలోచించాడు తను ఆమరునాడు చేయబోయే ఘోరకార్యాన్నిగురించి. ఏమైనాకాని అట్లాంటి విశ్వాసఘాతకకార్యం చేయొద్దనుకున్నాడు. కాని తనుచేయకపోతే యేమవుతుంది? ఆపని యింకె వరిచేనైనా యెట్లాగూ జరుగుతుంది. తప్పదు. పైగా తనవంశానికి వంశంధ్వంసం. మరి అట్లాంటితప్పందాన్ని తనే నెరవేరుస్తే? తనకూ తనవంశపారంపర్యానికి ఉన్నత అధికారం. ఎప్పుడూ తగ్గనిఐశ్వర్యం. ఎన్నో సందేహాలు గందరగోళపెట్టాయి.

పొద్దున్నే రోజుకిమల్లే స్నానసంధ్యాదిఅనుష్ఠానాల్ని తీర్చుకొని తమసావిడీకి వొచ్చారు అక్కన్న మాదన్న. గొప్పవిద్వాంసులు, పండితులు, సన్న్యాసులు, ఆగతానాగత వేదులనిపించుకునేజ్యోతిష్కులు, అంతా వాళ్లని ఆశీర్వదించారు నూరేళ్లు బతకమని, యింకా చాలాకాలం ప్రజాపాలనచేయమని, సర్వ సౌఖ్యాలు అనుభవించమని. వాళ్లందరిని దక్షిణతాంబూలాదులతో తగినట్టు సన్మానించి పాదుషావారిదర్శనం కోసం బైద్దేరారు. ఆబ్రాహ్మలవచనాలు విన్నాకొద్ది విశ్వనాథపండితుడికి వొళ్లు చెమటలు కమ్మాయి. తన శక్తులన్నిట్లో నమ్మకం నశించినట్టనిపించింది. నడవలేనేమోకూడా అనుకున్నాడు.

పైకి వెళ్లేతోవకి రెండుపక్కలా యిచ్చు కత్తుల్తో సైన్యంనుంచొని వాళ్లని గౌరవించింది. అక్కడక్కడ సేనానాయకులు ఆచారంప్రకారం వంగి సలాంచేస్తోంటే వాళ్లవాళ్లకి వొప్పగించినపనులని గురించి విచారిస్తో వెళ్లారు అక్కన్నమాదన్న. పైన మసీదుదగ్గిర సర్వసైన్యాధికారి అబ్దుర్రజాక్ ముందుకు వొచ్చి వంగి సలాంచేసాడు. “పైకివెళ్లి పాదుషావారి దర్శనం చేసుకొని తొందరగా తిరిగివొస్తా” నని అబ్దుర్రజాక్‌తో చెప్పాడు అక్కన్న. రాజసౌధానికిపక్కన్నే వున్న దేవాలయంలో దేవుడిదర్శనం చేసుకొని లోపలికెళ్లారు.

మామూలుప్రకారం పట్టుచొక్కాతొడుక్కొని నాజూగ్గా మెత్తకొరిగి కూచున్నాడు తానేషా మన్మథుడిలాగ. పాదుషావెంబడి పట్టణంనుంచి పరుగెత్తి వొచ్చినకవులు, పాటకాళ్లు, పారసీదేశపునృత్యకన్యలు కొలువుదీర్చారు. ఐనా పాదుషాముఖంమీద తాండవమాడే ఆచిరునవ్వు మాయమైంది. మాదన్నవాళ్లు సలాం చేయటంతోటే కూచోమని సంజ్ఞచేసాడు పాదుషా. ఈకొలువుని చూసి మాదన్న కాశ్చర్యమేసింది; అరచేతిలో ప్రాణాలుపెట్టుకున్న యీసమయంలో పాటలువినటానికీ నృత్యంమాడ్డానికీ పాదుషాకి గుండె లెట్లావొచ్చాయని. పాదుషాకి దగ్గిరగా జరిగి, “ఇట్లాంటి క్లిష్టపరిస్థితిలో వీటిలో మీరు సమయం వ్యయపరిస్తే తక్కినముఖ్యమైనకార్యాలు, చావుబతుకులసమస్యలు అట్లాగే వుండిపోతాయి,” అన్నాడు.

దీనంగాచూసి, “ఇవేరోజులు మనకి మిగిలినవి. తెల్లారకట్ట గోచరమైంది. మనపతనం తప్పదు. లాభం లేదు.”

“మరి యీప్రయాసంతా యెందుకు?”

మాదన్నముఖంలోని బాధనీ కోపాన్ని చూసాడు తానేషా. చచ్చిపోతోన్నవాడు యీ మాయప్రపంచం మీద నవ్వినట్టు నవ్వి, “ఐనా చేయవలసిందంతా, చేయ

గలిగిందంతా చేస్తూనేవున్నారు మీరు. నేను చేసే దేమిటి వేరే?"

మాదన్న మాట్లాడకుండా వేరువేపు చూసాడు. ఎవరూమాట్లాళ్లా. రెండునిం షాలు. అక్కన్న లేచి సలాంచేసి వెళ్లిపోయినాడు. తక్కినవాళ్లంతా తమ తమపనులు చూసుకోటానికి వెళ్లారు. పాదుషా ఆనృత్య కన్యలందరినీ పొమ్మని సేవకురాలిని పిలిచి, "కాశ్మీర దేశంనుంచి తెప్పించిన కన్యలిద్దర్ని నాశయనాగారం లోకి పంపించు" అంటూ మాదన్నవేప్రు చూస్తూ లేచాడు. ఆమాటల్ని మాదన్న విని ఆశ్చర్యంతో పాదుషావేపు చూసాడు. మళ్లీ అదేనవ్వు నవ్వాడాయన. లోపలికి వెడ్తోన్న పాదుషాకి మాదన్న విశ్వనాథ పండితుడు సలాంచేసారు. పాదుషా వెనక్కితిరిగి మాదన్న దగ్గిరికి వొచ్చి రెండుభుజాలమీద చేతులేసి ముఖంలోకి స్నేహంగా చూస్తూ, "అబద్ధంకాదు, నాకు దృఢంగా తెలిసింది. మనపతనం నిశ్చయం. తప్పదు. ఎవోమహత్తరమైనశక్తి చెప్పింది నాతో రాత్రి. నిజం."

మాదన్న కేమీ అర్థంకాలేదు. పూరికే పాదుషా ముఖంలోకి చూసాడు.

"అవును. నీ కర్థంకాదు. బహుశా యిదే మనం ఆఖరుసారి కలుసుకోటం." కళ్లల్లో నీళ్లు కమ్మాయి.

మాదన్నకు ఆముహూర్తాన్నే పాదుషా కేవలం రాజేకాడన్న ఆయనపూర్వచరిత్రంతా జ్ఞాపకం వొచ్చింది. నీళ్లునిండినఆకళ్ల వేపు చూడలేక దూరం జరిగి సలాంచేసాడు. పాదుషా చప్పున మాదన్నను కౌగలించుకొని, "నీకన్న నేనే ముందు చావటం తటస్థిస్తే దిగులొందొద్దు," అని లోపలి కెళ్లిపోయాడు. విశ్వనాథపండితుడు తెల్లమొహమేసి నోరుతెరుచుకో చూస్తోన్నాడు. ఆబ్రాహ్మల ఆశీర్వచనాల్నీ, పాదుషా మాటల్నీ మళ్లీ స్మరించుకొని యీ ప్రపంచంలో నమ్మదగినవీ, నమ్మదగనివీ తెలీక తత్తరపడ్డాడు. మాదన్నని, పాదుషాని, గోలకొండని యేమైనా కాని అని అదృష్టదేవతకి వొదిలేసి యెక్కడికైనా పారిపోదామా యీమొగల్ వాళ్లకి అవుపడకుండా అనుకున్నాడు. పూరికేవొచ్చిన ఆతలంపుని దీర్ఘంగా లోతుగా ఆలోచించాడు నిజంగా అట్లా పారిపోవాలా అని. అవును వీళ్ల అదృష్టం యేమైనా ఆపాపకార్యానికి బాధ్యత తననెత్తిమీద పడదు. తను మొగల్ సైన్యానికి చిక్కకుండాపోతే చాలు. కాని అప్పుడే ఆమె జ్ఞాపకంవొచ్చింది. ఆమె తనది గాకుండాపోతుంది. లేకపోతే మొగల్ రాజ్యానికి ముఖ్య అవయవంగా వున్న తన అన్న ఇబ్రాహింను మొగల్ సైన్యాన్ని తురకజాతిని తప్పించుకొని తనవెంబడి అడవుల్లోకి గుట్టల్లోకి రాగలుగుతుందామరి ఆమె! ఆమెలేకపోతే ఆఅడవుల్లో బ్రతికితేనేం, యిక్కడ కుక్కమల్లే మొగల్ కత్తికింద చస్తేనేం!

"మధ్యాన్నమైంది వెళ్లుదాం దు" అన్నాడు మాదన్న.

అక్కన్నకూడా దారిలో కలిసాడు. పాదుషా అన్నమాటల్ని యీతనితో చెప్పాలనుకున్నాడు మాదన్న. కాని దార్లోచెప్పట మెందుకు యింటికి వెళ్లిన తరువాత సావకాశంగా చెప్పుకోవచ్చు అనుకొని వూరుకున్నాడు.

పొద్దుటిమల్లేనే దారిపొడుగుతా యిచ్చుకత్తులు ధరించి నుంచుంది సైన్యం. సేనానాయకులు వీళ్లకి సలాంచేస్తోన్నారు. రామదాసునుబంధించినచెర దాటి నాలుగడుగులు నడవటంతోటే ఇబ్రాహింఖాన్ అనే సేనానాయకుడు వంగి సలాంచేసాడు. వాళ్లు ఆతన్ని దాటటంతోటే వారిద్దరివెనకాల నడుస్తోన్న విశ్వనాథ పండితుడివేపు బెదిరింపుగా చూసి యేదోసంజ్ఞచేసాడు ఇబ్రాహిం. విశ్వనాథపండితుడు రెప్పపాటున వొరనున్న కత్తిదూసి వాళ్లిద్దరిమీద పడ్డాడు. అదేముహూర్తాన ఇబ్రాహిం ఆతనిసైనికులు వాళ్లిద్దరిమీద పడ్డారు. అలారక్తంలో మునిగితేల్తోన్న అక్కన్నమాదన్నల శవాలతలల్ని ఇబ్రాహిం తనకత్తితో కోసాడు.

అలాపరుగెత్తడానికి కారణం లేదు. ఐనా పిచ్చియెత్తినట్టు, నిప్పునుతొక్కినట్టు వెనక్కితిరిగి పరుగెత్తాడు విశ్వనాథపండితుడు. పైకివెళ్లితే తానేషా

వాళ్లు పట్టుకుంటారనుకున్నాడు. ఎటూవెళ్లడానికి తోచక చిన్నతలుపుగుండా రాణివాసంలోకి పరుగెత్తాడు. ద్వారందగ్గెర కాపలావున్న సిద్దీకి యేమీ తోచక తనచేతులోవున్న తుపాకివెనకభాగంతో తలపై కొట్టాడు.

3

జేలీబేగం ఆమెచిన్నప్పటిపేరు గాదు. ఆమె లాలిత్యం, సౌకుమార్యం చూసి కోమలంగా తీగమల్లే వుండటంచేత ఆమె కీముద్దుపేరు పెట్టుకున్నాడు తానేషా. అయిదేళ్లకిపూర్వం గోవానుంచి గుఱ్ఱాలని తెచ్చిన పోర్చుగీసువ్యాపారస్తుడు ఆమెనీ ఆమెకంఠమాధుర్యాన్ని వర్ణించిచెప్తే ఆకులక్షులువ్యయపరిచి తెప్పించినపోర్చుగీసుయువతి ఆమె. ఆమె మొదటితడవ పాడినప్పుడు తానేషా తన్మయుడైపోయి వొళ్లుమరిచి నృత్యంచేయటం మొదలెట్టాడట. ఉంకోతడవ యెండాకాలం వెన్నెల్లో నవానీ ఆమెపాడితే వేలకువేలుగా పాములన్నీవొచ్చి ఆడాయట. కిల్లాలో వుత్తరంవేపున్న పెద్దహవుజులో పన్నీరునింపించి తానేషా సొంతంగా పడవనడుపుతోంటే నన్నంగా ఆయనకి వొరిగిపండుకొని ఆమెపాడినపాట కింద కిల్లాలోని వాళ్లకి వినపడి మూడుగంటలసేపు శ్వాసకూడా పీల్చకుండా పీనుగల్లాగ పడివున్నారని చెప్పుకుంటారు. ఆమె వొచ్చాక మూడునెల్లదాక ఆమెమహల్ దాటి బైటికి రాకపోవడమేకాకుండా మాదన్నకికూడా దర్శన మివ్వలేదట పాదుషా.

ఆమె అప్పుడే స్నానంచేసి వొహర్తచీరకట్టి స్తోంటే యెండపాలుపుకి నుంచుంది. పైనఅంతా వొకే తడవ గొల్లుమన్నారు. శత్రుసైన్యం కిల్లాలో జొరబడ్డదని అందరికీ వొకేతడవ తోచింది. రాణివాసంలోని యేబదిరాణులు వాళ్లసేవకురాండ్రు అంతా వొకేతడవ కెవ్వుమన్నారు. ఆచీరను అట్లాగే వొదిలేసి నిల్చోలేక వెనకాలనుంచున్నదాసీచేతుల్లో పడ్డది జేలీబీ. వాళ్లు చూస్తోండగనే గోడమీదినుంచి జారి జాజిపొదదగ్గెర పడిపోయాడు వొహయువకుడు. రక్తంతోతడిసినకత్తి నాలుగడుగులదూరంలో పడ్డది. నెత్తిలోంచి దుముకుతోన్న నెత్తురు మడుగు కట్టింది. నెత్తురులో తడిసిన అతనిజరీఅంచుధోతిని చూడ్డంతోటే జేలేబీ అనుమానం మరీస్థిరపడ్డది. అట్లాంటిహిందూధీరుణ్ణి పాదుషావైరులుతప్ప యితర్లు కొట్టరు. వాళ్లు కోటచుట్టూవున్న శత్రుసైన్యంగాక వేరేకాదని ఆమెగట్టినమ్మకం. ఎదురుచూస్తోన్న పిడుగు పడనేపడ్డ దనుకున్నది.

దాసీవొహర్తవొచ్చి, "అత డింకా చావలేదు; బతుకుతాడేమో" అంది.

తనూచూస్తానంది జేలీబి. మెల్లిగా ఆమెను ఆతనిదగ్గిరకి తీసికెళ్లారు. ఆతనిచక్కదనం, ధీరత్వం చాటేఆముఖం, పెద్దబహదాను తెలిపేదుస్తులు ఆమెకొహవిధంగా జాలిని కలిగించాయి. తెగిపోయి అడ్డదిడ్డంగా ముత్యాలహారం పడివున్న ఆ వక్షం కొంచంకొంచంగా కదుల్తోంది. తనకు సర్వం ఐనపాదుషాకోసం ప్రాణాలనికూడా ధారవోసే యిట్లాంటివాళ్లకి త నెట్లా కృతజ్ఞత చూపించగలదు! పాదుషామీద పడబోతోన్న దెబ్బని తాను తిని ఆయనని రక్షించినట్టు తోచిందామెకి ఆ సమయాన. ఆదాసీవేపు చూస్తో అంది, "ఎక్కడికి పంపుదా మీళన్ని; అంతా ప్రాణాలకోసం పరుగెత్తుతోన్నారు."

"నాకు కొంచంగా రణవైద్యం వొచ్చు. మనప్రాణాలమీదికి వొచ్చిందాకైనా యీతనిప్రాణాలు కాపాడ్దాం."

అందరికీ తానేషాఅంటే దైవం. ఆయనశత్రువులు తమశత్రువులు; ఆయనస్నేహితులు తమస్నేహితులు!

"ఐతే లోపలికి తీసికెళ్లండి."

అల్లరి కాస్త తగ్గింది. సైన్యంలో కొందరు తిరుగబడి యింటికివెడ్తోన్న అక్కన్నమాదన్నల్ని చంపారనీ, తక్షణమే ఫౌజుసర్దారు అబ్దుర్రజాక్ వొచ్చి చాలామందిని పట్టుకున్నాడనీ, పారిపోతోన్న యిద్దర్ని అక్కడే చంపాడనీ కిల్లాఅంతా తెలిసి

పోయింది. శత్రువు లింకా బైటనే వున్నారని తెలిపి యిప్పటికైతే దక్కాయికదా ప్రాణాలని కోటలోని వాళ్ల ప్రాణాలు కుదుటపడ్డాయి అప్పటికి.

దాసీనిపిలిచి యెలావుంది ఆతనికని అడిగింది జేలీబీ. "కట్లుకట్టాంకాని యింకా స్పృహ రాలేదు; అప్పుడప్పుడు 'మాదన్న' అంటూ కలవరిస్తా" డని చెప్పింది దాసి.

అక్కన్నమాదన్నల్ని హతమొనర్చిన కత్తివాటు నుంచే తప్పించుకో వొచ్చా డీతడు పాపం అనుకుంది జేలీబీ.

రెండోనాటి వుదయం అతనికి తెలివి వొచ్చిందని దాసీవొచ్చి చెప్పింది. చూడ టాని కెళ్లింది జేలీబీ. మంచం మీద పడుకున్నాడు. వొహ కన్ను అవుపడకుండా కట్టు కట్టారు నెత్తికి. ముఖం చాలా యీడ్చుకోపోయింది. దాసీ దెగ్గిరికెళ్లి చూట్టానికి రాణీవొచ్చిం దని చెవులో చెప్పింది. కన్ను తెరిచి దూరం గానుంచున్న జేలీబీని చూ సాడు. అంతబాధలోవున్నా ఆమెసౌందర్యం ఆతనిదృష్టిని తిప్పేయకమానలేదు. ఆమె సౌందర్యాన్నిగురించి యె న్నోసార్లు విన్నాడు కాని యింతఅద్భుతంగా వుంటుం దనుకోలేదు. వొహతడవ కన్నుమూసి తెరిచి మళ్లీ చూసాడు. చేతినితలపైకెత్తి సలాంచేసాడు. దెగ్గిరగా జరిగింది జేలీబీ.

"ఎలావుంది?"

"నొప్పి."

"దిగులుపడకు తొందరగా నయమవుతుందిలే."

అతడు మాట్లాడక యింకోవేపు చూసాడు.

"మీ వాళ్లెవరో చెప్తే వాళ్ల దెగ్గిరికి నిన్ను పంపిస్తాం."

వొక్కనింపంతరువాత యీవేపుతిరిగి రెండు చేతులు జోడించి ఆమెవేపు దీనంగా చూస్తూ, "క్షమిం చండి నేనెవరో చెప్పను. అనర్హమైన యీప్రాణాన్ని రక్షించాలంటే నన్నిక్కడే వుంచండి."



"చేతిని తలపైకెత్తి సలాంచేసాడు"

చాలాదిగులుపొందా డనుకుంది. అతనివోణికే చేతిమీద చేయివేసి "భయపడకు. పూర్తిగా నయమయేవరకు యిక్కడేవుందువుగాని. నీ కిక్కడేమీ భయం లేదు."

కృతజ్ఞతను సూచించేకళ్లతో ఆమెముఖంలోకి చూసి సలాంచేసాడు. ఆమె వెళ్లిపోబోతోంటే, "నేనిక్కడున్న విషయం యెవరికీ తెలీనీకండి. ఎవరికి గూడా."

"తెలీదు. ఎవ్వరికీ తెలీనీను."

ఎక్కడతెలుస్తే శత్రువులొచ్చి చంపుతారో నని భయపడ్తోన్నాడు పాపం అనుకుంటో వెళ్లిపోయింది.

౪

నెలలు గడిచిపోయాయి.

మొగల్ సైన్యం అట్లాగేవుంది కిల్లాచుట్టూ. శత్రువులు లోపలికి ప్రవేశించటానికి యెన్నోపన్నుగడలు పన్నారు. ఎన్నోతడవల కందకంపూడ్చి కిల్లాగోడని ప్రాకప్రయత్నించారు. కాని వొక్కప్రయత్నంకూడా సాగలేదు.

కిల్లాభాగమంతా మంత్రులు వహించారు. మీ యిష్టంవొచ్చినయేర్పాట్లు చేసుకోమన్నాడు పాదుషా. రాత్రింబవళ్లు సంగీతం, నృత్యం, స్త్రీలు యివే ఆయన ప్రపంచం. కిల్లాలో చాలామంది కుట్రదారు లున్న విషయం అందరికీ తెలిసింది. మంత్రులందరూ తమ చేతనైనంతజాగ్రతగా మెదుల్తోన్నారు. ఎవరిగురించి యేమాత్రం అనుమానంకలిగినా విచక్షణచేసి దోషిని నడిమిబురుజుదెగ్గిర కిల్లాఅంతాఅవుపడేట్టు వురినెక్కించారు. కొందరు మోసగాళ్లని ప్రజలందరిముందు చిత్రవధ చేసారు స్వామిద్రోహంకింద. రాత్రంతా దివిటీలు వెలుగించుకొని విచ్చుకత్తులసైన్యదళం ఆరుసార్లు గస్తు తిరిగేది. కిల్లాగోడలమీద, బురుజులమీద, గవునల దెగ్గిర కత్తులుదూసినసైన్యం వొంతులువొంతులుగా కాపలాకాస్తోంది.

మొగల్ సైన్యం మరీ యెక్కువౌటం చూసి మంత్రులంతా పాదుషాదెగ్గిరికెళ్లి "యిప్పటికైనా అనుజ్ఞయిస్తే వొహమధ్యరాత్రి సైన్యాన్నంతా తుఫానులాగా మొగల్ సైన్యంమీద దుమికించి బలాబలాలు చూపించుకుందాం, యిట్లా యెన్నాళ్లని కూచోడం" అన్నారు. ఏమైనాసరేకాని యుద్ధం వొద్దన్నాడు. పోతే యేంచేయమంటావన్నారు. మొదటితడవ మాట్లాళ్లేదు పాదుషా. రెండవతడవ మళ్లీ వేడుకున్నప్పుడు చెప్పాడాయన, గోలకొండ పడిపోక తప్పదనీ, యెన్నివుపాయాలైనా లాభంలేదని తనకు దృఢంగా తెలిసిందని. "ఇదంతా పిచ్చివేదాంతం, అలా నిరాశపడ్డానికి యేమీ కారణాలు లేవు, మూడునెల్లనుంచి కోటని రక్షించగలిగాం" అన్నారు. యుద్ధంలో జనక్షయంకాకుండా తప్పించాలంటే సంధిచేసుకోవాలని అనేకవిధాలుగా బలవంతపెట్టారు. సరే నాజనాన్ని సురక్షితంగా వుంచితే యేసంధికైనా, యెట్లాంటిషరతులకైనా వొప్పుకుంటానన్నాడాయన. చదవటంతోటే రాతిగుండెసైతం కరిగిపోయేట్టు వినతిపత్రం సిద్ధంచేసారు మంత్రులంతా కలిసి మోజ్జంకి పంపడానికి. తానేషాకు కావాల్సింది ప్రజారక్షణం, కాబట్టి దీనికి మీరువొప్పుకుంటే యేషరతులకైనా ఆయన వొప్పుకుంటాడని తెలిపారు. ఆవుత్తరం మోజ్జంచూసి హృదయంకరిగిపోయి మెత్తగిల్లాడు. స్వార్థంకోసం జయలక్ష్మిపేర లక్షలకులక్షలప్రాణాల బలవంతంగా బలియిచ్చేరాజుకాడు తానేషా అని గుర్తించాడు. కాని యింతలోకే ఔరంగజేబు వొచ్చి యింతచిన్నదుర్గాన్ని జయించలేక యీమూడు నెల్లనుంచి మూలుగుతోకూచున్నావా అని తిట్టాడు కొడుకుని. మోజ్జం తానేషాపంపిన వినతిపత్రం ఆయనకి చూపిస్తే మోజ్జం తానేషావొలలో పడ్డాడనీ, తానేషాదెగ్గిరవున్న కళ్లనితిప్పేసేఅందంకలస్త్రీల కాళ్ళపడి అబద్ధం చెబ్తోన్నాడేమో నని అనుమానపడ్డాడు ఔరంగజేబు. ఇది వూహించి కొందరు ఔరంగజేబుదెగ్గిర మోజ్జంమీద చాడీలు చెప్పారు. లంచం తిన్నాడని దొంగవుత్తరాలని చూపెట్టారు. వాటన్ని

11. 5- 17 ాం3

టినీ నమ్మాల్సివొచ్చింది ఔరంగజేబు. మోజ్జంని చెర పెట్టి తానే సొంతంగా సేనాధిపత్యం వహించాడు.

రాత్రి రెండుఝాములైనతరువాత ఆ బురుజును కాచేనాయకుడికి లంచమిచ్చి చాకలివాడ కట్టుకున్న కోటగోడని త్రాటినిచ్చేనమూలంగా ప్రాకింది మొగల్ సైన్యం యాభై దాక. చడీచప్పుడు కాకుండా యింకా యెక్కుతోన్నారు. కింద చాకిరిదగ్గిరవున్న కుక్క మొరగటం ఆరంభించి జనాన్నంతా ఆవేపు తెచ్చిం ది. మొగల్ సైనికులు కొందరు భయపడి కందకంలోకి దూకి కాళ్లుచేతులు విరగకొట్టుకున్నారు. తక్కిన వాళ్లని పాదుషాసైన్యం పట్టుకుంది. తెల్లారి ఆకుక్కని పట్టితెప్పించి కోటని రక్షించినందుకు తన మెడ లోని ముత్యాలపట్టెడ తీసి దానిమెడకి కట్టించాడు తానేషా.



"ఓహో! అయితే నువ్వొక్కతివే చాలాపతివ్రత మన్నమాట.........నీకు నాలి కెట్లా

తానేపా జ్ఞాపకంచేస్తే వెళ్లి నాలుగురోజుల. దాకా తిరిగి రాలేకపోయింది బేలిబీ. వొచ్చి చూసే అప్పటికి ఆయువకుడిగాయం చీంపోసింది. జ్వరం కూడా వొచ్చింది తీవ్రంగా. బేలేబీ గాభరాపడి పరిచారకురాండ్రందరినీ తిట్టింది అశ్రద్ధచేసారని. రాణు లకు వైద్యం చేయడానికున్న వైద్యురాల్ని పిలిపించి చూయించింది. ప్రాణం అపాయంలోవుంది; మూడు

ఆడింది? నిజం చెప్పు వా డెవడు, భర్తేనా?"

రోజులు కన్నుమీద రెప్పేయకుండా శ్రద్ధతీసుకుంటే తరువాత చూద్దామంది- ఆతన్ని దాసీలను నమ్మక ఆతనిమంచంపక్కనే కాచుకోకూచుంది బేలిబీ. ఆతని ముఖం చూస్తే యెట్లాగైనా రక్షించాలనిపించిం దామెకి. ఏదగ్గిరిబంధువో అనిపించింది.

నాలుగోనాటివుదయం ఆతనిదగ్గిరికెళ్లి కూచొని ఆముఖంవేపు చూసింది. మెల్లిగా కళ్లుతెరిచి ఆమె మొఖంవేపు చూసాడు. ఆతనిమాటల్లో త్రాణ లేనట్టే చూపులోకూడా నీరసత్వం కనబడ్డది. ఆ కళ్లల్లో నీళ్లు తిరిగి ఆచూపుల్ని మరీ దీనంచేసాయి. చిక్కిపోయిన తనచేత్తో ఆమెచేతిని పట్టుకొని "యెక్కడిరుణం చెల్లీ నువ్వు నా కీజన్మంలో తీరుస్తోన్నావు? ఎందుకు బతికించావమ్మా యీపాపిని?"

ఆముఖంచూస్తో అమాటలువింటే ఆమెకుగూడా యేడ్పొచ్చింది. తనపైటచివరతో ఆతనికళ్లనీళ్లు తూడుస్తో, "యేడవకు, యేడవకు; మూడురోజులు నేనులేకపోవటంచేత అశ్రద్ధ జరిగి యింతబాధ పడ్డావు. ఇహవెళ్లను నిన్నువొదిలి. భయపడకు నయమవుతుంది తొందరగానే."

"నాకు బతకాలనిలేదమ్మా నిజంగా. బతుకు అవసరమేలేదు. అందుకనే యెట్లాగైనా, తొందరగా చావాలని దాసీవాళ్లని బెదిరించుకొని అవుపత్యం చేసి మందుపుచ్చుకోక రోగం పెంచుకున్నా. మళ్లీనువ్వు— ఎందుకమ్మా నామీద నీ కింతదయ?"

"అలా బలవంతంగా మరణం తెచ్చుకోటం పాపంకదూ?"

"బతికి బైటపడితే ఘోరంగా, మరీఘోరంగా చావాల్సివొస్తుందిచెల్లీ."

"భయపడకు యింకా శత్రుసైన్యమంతా బైటనే వుంది. మాదన్నవాళ్లు చస్తేనేం తానేపావున్నంతవరకు మనకు భయంలేదు."

గట్టిగా మూలిగి కళ్లనుంచి మరీకారే ఆనీటిని ఆమె కవుపడకుండా ఆవేపు తిప్పుకున్నాడు తలని.

వొక్కనిమిషంతరువాత మళ్లీ యీవేపు తిప్పి స్థిరంగా, "చెప్పను, చెప్పను చెల్లీ నీతో."

ఆతన్ని మాట్లాడిస్తే బాధపడతాడని వొంటి మీదికప్పు సరిచేసి నెమలియీకలఫంకాతో విసరడం మొదలెట్టింది.

రాత్రి రెండుగంటలకి చప్పున మేలుకొచ్చిం దామెకి. కోటంతా యేమీ వినపడకుండా వొకటే అల్లరి. పైకెక్కి చూసింది. వొహర్ని పట్టకుండా వొహరు యేడుస్తూ, దివిటీలు లాంతర్లు పట్టుకో పరుగెత్తుతోన్నారు. ఎక్కడికో? దాసీలు పరుగెత్తుతోవొచ్చి చెప్పారు మోసకాడెవరో శత్రువులకి పడమటిగవిని తెరిచాడనీ, సైన్యమంతా లోపల జొరబడుతోందని. ఆమెగూడా కెవ్వుమంది. అంతా ఆయువకుడుపడుకున్నగదిలోకి పరుగెత్తారు. వొహచేతిమీద లేచి వీళ్లవేపు చూస్తూ, యేమిటేమి టన్నాడు. జేలీబీ ఆతనిమంచందగ్గిర కూలబడి ఆతని మీద చేతులేసి, "అయింది. శత్రువులు."

లేచి కూచొని ఆమెని లేపి పైకివొరిగించుకొని, "భయపడకు, భయపడకు చెల్లీ" అని యింకా యేమేమో అన్నాడు ధైర్యంగా ఉత్సాహంగా. కాని యెవరూ వినిపించుకోలా. అంతా వొహటేగోల.

చేతులో కత్తిపుచ్చుకొని బరిగుఱ్ఱంమీద యెక్కి ప్రవాహంలావొచ్చే శత్రుసైన్యాన్ని గవునిలో అడ్డుపెట్టాడు అబ్దుర్రజాక్. వందలకొద్ది శత్రుసైని కుల్ని నరికిపారేసాడు అద్భుతమైనశౌర్యాన్ని ప్రక టిస్తూ. వొంటినిండన్నీ గాయాలు తగిలాయి. శత్రుసైని కుడికత్తివాటుకి గుఱ్ఱం కళ్లెంతెగి అతనిస్వాధీనం తప్పింది. ప్రవాహం నిరాటంకంగా లోపలికివొచ్చింది.

తెల్లారేవరకు కోటంతా ఔరంగజేబుస్వాధీనం అయింది.

చావంగ మిగిలినవాళ్లందరినీ చెరపెట్టారు. ముఖ్యంగా రాజబంధువుల్ని.

తానేషాను దౌలతాబాదు పంపారు.

౫

ఔరంగజేబుసేవకులు వొచ్చి వొహరి తరువాత వొహర్ని తీసుకెళ్లుతోన్నారు తానేషారాణుల్ని. జేలీబీవొంతుకూడా వొచ్చింది.

మామూలుముతుకగుడ్డ తెల్లఅంగరకా తొడుక్కొని పెద్దగడ్డంతో కూచున్నాడు ఔరంగజేబు యెడమచేత్తో గడ్డం పీక్కుంటో. ఆతన్ని చూట్టం తోటే వొళ్లు జల్లుమం దామెకి. ఇట్లాంటిక్రూరమైన ముఖం మోటురూపం యిదివర కెప్పుడూ చూళ్లే దామె. ఎట్లాకన్నదో ఆతల్లి!

"ఈమె జేలీబీ. పోర్చుగీసుయువతి" అని చెప్పాడు ఔరంగజేబుపక్కనకూచున్న ముసలిమొల్లా. ఈమొల్లాకే తానేషా, తానేషారాణులు తలవంచి సలాంచేసి దీవనలు పొందింది. ఈమొల్లానే రెండురోజులకిపూర్వం తానేషాను యింకా నూరేళ్లుబతకమనీ, ప్రపంచమంతా వొహటేరాజ్యంగా యేలమనీ దీవించింది.

"ఈమెయింట్లోనే తురకవేషంతో వున్న హిందూ దొరికింది. తనభర్త అంది;" అన్నాడు యింకొహమొల్లా.

"ఓహో! అయితే నువ్వు చాలాపతివ్రత వన్నమాట. వాడిని, ఆకాఫర్ని అసహ్యంలేక యింట్లోపెట్టుకొని సిగ్గులేక నాభర్త అనటానికి నీకు, పవిత్రమైన యిస్లాంమతందానివైన నీకు నాలి కెట్లా ఆడింది? నిజంచెప్పు వాడెవడు, భర్తేనా?"

"కాదు."

"కాదు, కాదు; అంతకుముందు దొంగభర్త, అప్పుడు భర్త, మరియిప్పుడో?"

నిజానికి ఆమెకిగూడా తెలీదు అతనెవరో. అప్పుడు అతను హిందూఅంటే పుటుక్కునచంపేస్తారని తురకవేషం వేసింది. తురక అంది. తురకైతే నీ కేంకావాలి, భర్తా అని ఆమొల్లాఅంటే అట్లాగైనా దక్కుతాడేమోనని అవునంది. కాని ముందు యిట్లా

పరిణమిస్తుందనుకోలా. ఇప్పుడు యేవిధంగా సమర్థించ బోయినా లాభంలేదని వూరుకుంది మాట్లాడకుండా.

ఆహిందువును తీసుకోరమ్మన్నాడు ఔరంగజేబు. సంకెళ్లు తవిలించి యిద్దరుపట్టుకో తీసికొచ్చారు. తలకి కట్టు అట్లాగేవుంది. మరీ చిక్కిపోయాడు.

ఆపెద్దమొల్లా ఆతన్ని చూసేమాట్టంతోటే అన్నాడు, "ఓహో, యీతడు విశ్వనాథపండితుడు. నాకు బాగాతెలుసు. మాదన్నకు యితడు మంత్రీ, అంగరక్షకుడు, స్నేహితుడు, అంతాను."

ఔరంగజేబుకి సలాంచేసి, "కాని మాదన్నని అక్కన్నని చంపించి నేనే," విశ్వనాథబట్టు అన్నాడు గట్టిగా.

"అయితే యిదేపనిగా యిక్కడవుండి చివరకి వాళ్లతలల్ని తెచ్చి నాముందు పడేసిన ఇబ్రాహింఖాన్ గడ్డికోసాడు గావును మూడేళ్లపాటు గోలకొండలో!" నిదానంగా అన్నాడు ఔరంగజేబు.

"ఆయన్ని రప్పించి అడగండి."

ఇబ్రాహింఖాన్ వొచ్చాడు. ఆతన్ని అడిగాడు ఔరంగజేబు, "ఈతడు ఆహిందువులతలల్నికోసి నీకిచ్చాడటకదూ నాదగ్గిరికి తీసికెళ్లమని?"

"సత్యం ప్రభువులే విచారించాలి. నేనేచెప్పితే ఆత్మస్తోత్రంగా వుంటుంది." అని వంగి సలాంచేసాడు ఇబ్రాహిం.

ఔరంగజేబు విశ్వనాథపండితుడివేపు చూసాడు. అతను అట్లాగే నిర్విణ్ణుడై చూస్తోన్నాడు.

"అయితే నువ్వు మాకుచేసిన వుపకారానికి యేం బహుమతికావాలంటావు? ఈబేలీబీ వొక్కర్తె చాలా.

"నస్నేహైనా అనండి, చంపండి, చిత్రవధ చేయండి. కాని ఆమెనిమాత్రం అవమానపరుచొద్దు? ఆమె నాచెల్లెలిసమానం."

"అవును, అవును; మాఅందరిముందు ఆమె నీచెల్లెలిసమానం. లేకపోతే—"

అంతా నవ్వారు. విశ్వనాథపండితుడు ఉగ్రుడైపోయాడు. కాని యిద్దరు రెండురెట్టల్ని పట్టుకొని కదలనిచ్చారుకారు.

"రేపేపాటికి యీబేలీబీ నిన్ను బేలీమల్లే అల్లుకుంటే చాలా?"

అంతా నవ్వారు మళ్లీ.

మర్నాటివుదయం—

బేలీబీ విశ్వనాథపండితుడిని వొహరిమీద వొహర్ని పడుకోపెట్టి చేతికి చేయి, కాలుకు కాలు, నడుంకు నడుం బిగించి త్రాళ్లతో కట్టి రెండుశరీరాలు వొహటే చేసారు. కట్టెల్ని చితిగా పేర్చి దానిమీద యినప మంచం వుంచి దాంట్లో వీళ్లని పడుకోపెట్టి గొలుసుల్తో బిగించారు.

చితి అంటించారు.

పెద్దమంటగా కాల్తోన్నప్పుడు చుట్టూవున్న వాళ్లని తోసుకొని దేహంఅవుపడకుండా బురకా కప్పుకున్న స్త్రీ సరాసరి పరుగెత్తుతో వొచ్చి మంటలో దూకింది. ఆబాధకి తాళలేక లేస్తోపడుతో తన ముఖాన్ని యీవేపు తిప్పింది. ఇబ్రాహింఖాన్ కెవ్వుమన్నాడు.

తెల్లారిచూస్తే ఆయినపమంచం దానిమీద వొదులుగా గొలుసులూ అట్లాగే వున్నాయి బూడిద గాసిలో.